క్లుప్తంగా

ఇంటర్‌లో నివ్య ఒకేషనల్ విద్యార్థుల ప్రతిభ


ఇంటర్ ఒకేషనల్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

కంబాలచెరువు: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో దానవాయిపేటలోని నివ్య ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపాలని ఆ కళాశాల డైరెక్టర్ పి.ఎర్నెస్ట్ మోజెస్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ ఒకేషనల్ విభాగం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో పి.రిత్విక్ 954, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్‌లో జి.మేరీ ప్రేమలత 940, ఎన్.కుసుమ 926, ఎంఎల్‌టీలో జె.రమ్య 918 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఒకేషనల్ ఎంఎల్‌టీలో పి.నవ్యశ్రీ 478, డి.విజయ్ కుమార్ 477, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో సీహెచ్.నాగ పద్మావతి 476 మార్కులు సాధించారన్నారు. ఇంటర్మీడియేట్ ఒకేషనల్ విభాగంలో కళాశాల ముందంజలో నిలిచిందన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, దానికి కృషి చేసిన అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్ గారపాటి ఎలిజబెత్, పి.మోజెస్ అభినందించారు.

264 మందికి వైద్య పరీక్షలు

కడియం: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కడియపుసావరం సచివాలయం 2 పరిధిలో మంగళవారం 264 మందికి వైద్య సేవలు అందించినట్టు శిబిరం పర్యవేక్షకులు డాక్టర్ ఎస్.నాగసాయిమౌర్య తెలిపారు. అలాగే 9 మందికి కంటిపరీక్షలు నిర్వహించామన్నారు. ఆరోగ్యశ్రీకి ఒకరిని రిఫర్ చేసినట్టు తెలిపారు. వైద్యులు ఎం.మణిజ్యోత్స్న, పర్షాద్, చైతన్య శేఖర్, కె.రాజేష్ వైద్యపరీక్షలు చేశారన్నారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ శిబిరాన్ని సందర్శించారన్నారు.

రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం


సీతంపేట రామాలయం వద్ద చేసిన ఏర్పాట్లు

సీటీఆర్ఐ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్రోధినామ సంవత్సర చైత్రమాస శుద్ధ నవమి బుధవారం స్వామివారి కల్యాణం జరగనుంది. స్థానిక సీతంపేటలోని వందేళ్ల చరిత్ర గల సీతారామాలయంలో సర్వం సిద్ధం చేశారు. జాంపేట పోలీసు క్వార్టర్స్‌లోని కోదండ రామాలయం, దేవీచౌక్‌లోని సీతారామ, లక్ష్మణ, హనుమ సమేత ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. రామాలయాలతో పాటు ఆంజనేయస్వామి ఆలయాల్లో కూడా శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కడియం: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర పార్టీల అభ్యర్థులు స్థానికేతరులని, ఎన్నికల తర్వాత ఎవరిదారి వారు చూసుకుంటారన్నారు. స్థానికుడైన తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా


పంచాయతీ సిబ్బందికి రాజీనామా అందజేస్తున్న వలంటీర్లు

కడియం: మండలంలోని పలు గ్రామాల నుంచి వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. దుళ్ల గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు మంగళవారం తమ రాజీనామాలను పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేయడంపై మనస్థాపంతో రాజీనామాలు చేస్తున్నట్లు వారు ఆ లేఖల్లో పేర్కొన్నారు.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

కడియం: ఎన్నికల ప్రచారంలో నిబంధనలు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ హెచ్చరించారు. ఆయన మంగళవారం దుళ్లలో వివిధ పార్టీలకు చెందిన ప్రచార వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం పూర్తిస్థాయిలో అనుమతి పత్రాలు తీసుకోవాలన్నారు. నిర్ణీత సమయంలో మాత్రమే ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల నిబంధనల అమలుపై పంచాయతీ కార్యాలయ సిబ్బందిని ఆరాతీశారు.

బాలికల సదనం సందర్శన

కంబాలచెరువు: స్థానిక ప్రకాశం నగర్‌లోని ప్రభుత్వ బాలికల సదనాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మంగళవారం సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించి బాలికలతో మాట్లాడారు. పరిశుభ్రత పాటిస్తూ వేళకు ఆహారం తీసుకోవాలని, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఏ విధమైన అసౌకర్యం కలిగినా వెంటనే డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలన్నారు.

కందుకూరి సేవలు చిరస్మరణీయం

- కొనియాడిన వక్తలు
- ఘనంగా యుగపురుషుడి జయంతి


కందుకూరి దంపతుల సమాధికి పుష్పాంజలి ఘటిస్తున్న విద్యాశాఖాధికారులు


బీవీఎస్ మూర్తిని సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

సీటీఆర్ఐ: యుగపురుషుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఆయన జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కందుకూరి చిత్రపటాలు, విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కందుకూరి పరిశోధకులు డాక్టర్ పీవీబీ సంజీవ రావు మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలు, మూఢనమ్మకాలను రూపుమాపడానికి నాటకాలను ఆయన ప్రధాన ఆయుధంగా చేసుకున్నారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు పాల్గొన్నారు.

- కందుకూరి వీరేశలింగం నిర్మించిన రాజమహేంద్రవరం పురమందిరంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కళాగౌతమి డాక్టర్ బీవీఎస్ మూర్తి, డాక్టర్ తెరపట్ల సత్యనారాయణ, డాక్టర్ పీవీపీ సంజీవరావు పాల్గొన్నారు.
- రాజమహేంద్రవరం వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ సభ్యుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆనంద గార్డెన్స్‌లోని కందుకూరి స్మృతివనంలో వారి సమాధులకు పుష్పాంజలి ఘటించారు. అలాగే ఆనంద గార్డెన్స్‌లో దేవదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్, హితకారిణి సమాజం ఈఓ సింగం రాధ ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు.
- వంకాయలవారి వీధిలో కందుకూరి స్వగృహంలో గల వీరేశలింగం పంతులు విగ్రహానికి ఉమ్మడి పార్టీల ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందరేశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందుకూరి వీరేశలింగం జరిపించిన మొట్టమొదటి వితంతు వివాహ వేదిక నమూనా వద్ద కుటుంబంతో కలిసి ఫొటోలు దిగారు.

నగరంలో పలుచోట్ల..

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు కళాశాలలోని కందుకూరి దంపతుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

- స్థానిక ఉమెన్స్ కాలేజీ వద్ద ఉన్న వీరేశలింగం దంపతుల సమాధులను జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు సందర్శించారు. వారికి నివాళులు అర్పించారు.

జగన్‌పై దాడి వెనుక ప్రతిపక్షాల కుట్ర


దారపు రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడలో సీఎం జగన్‌పై జరిగిన దాడి వెనుక ప్రతిపక్షాల కుట్ర ఉందని ఆంధ్రప్రదేశ్ రెడ్డి జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దారపు రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన మంగళవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ సంక్షేమ పాలనకు అన్ని వర్గాల ప్రజలూ మద్దతు తెలుపుతున్నారన్నారు. ఆయన బస్సుయాత్రకు స్వచ్ఛందంగా తరలివస్తున్న జనాన్ని చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. జగన్ వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే టీడీపీ, జనసేన నాయకులు ఈ విధమైన దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు చూస్తుంటే వారి నైజం బయటపడిందన్నారు.

పోలింగ్ సామగ్రి ప్రణాళిక పూర్తి


సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సిటీ నియోజకవర్గంలో పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రణాళిక పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఎంపిక చేశామన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి 20 బృందాలను నియమించామని, ఒక్కోబృందంలో ఆరుగురు సిబ్బంది ఉంటారన్నారు. ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పోలింగ్ స్టేషన్లను మే 12న కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డీఎస్పీ సెంట్రల్ కె.విజయపాల్, అర్బన్ తహసీల్దార్ కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం


పాత బొమ్మూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణు, చందన నాగేశ్వర్


20వ డివిజన్‌లో టిఫిన్ బండి వద్ద దోశ వేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- జోరుగా ఎన్నికల ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ పాలన సాగిందని ఆ పార్టీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. పాతబొమ్మూరు, వడ్డీ వీరభద్ర నగర్‌లో మంగళవారం సాయంత్రం ప్రముఖ న్యాయవాది, పార్టీ నాయకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ తాను రూరల్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన 50 రోజుల్లోనే రూ.కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. టీడీపీ పాలనలో ఇచ్చిన ఒక్క హామీనీ చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజుబాబు, అనసూరి పద్మలత, ముద్దాల అను, యెనుముల త్యాగరాజు చెల్లయమ్మ, దాకే శ్రీను, కంభం సుబ్బారెడ్డి, సద్గుణ రామారెడ్డి, సోమన శ్రీను, మాలేటి రమేష్, నాగులపల్లి ఆశ, సమీర, రాహుల్, పెయ్యల రాజేష్, నక్కా రాజేంద్ర, వైఎస్ కుమార్, అక్కుమహంతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మీ సేవకుడిగా పనిచేస్తా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రూరల్ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే మీ సేవకుడిగా పనిచేస్తానని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. నగరపాలకసంస్థ పరిధి 20వ డివిజన్‌లో రూరల్ నియోజకవర్గ డివిజన్ల అధ్యక్షుడు మింది నాగేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. ఆయనను మరోసారి సీఎం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, జిల్లా వైద్యవిభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, 20వ డివిజన్ నాయకులు డబ్బింగ్ రమేష్, దళవ కోటి, కిలిమి నారాయణరెడ్డి, నర్సింహుల అంజిబాబు, అనసూరి రమణ, దల్లి రాజశేఖరరెడ్డి, నందిక సాయిరాం రెడ్డి, గణపతి, అలాగే రాజమౌళి, అంగాడ సత్య ప్రియ, పడమటి కామరాజు, చీకురుమిల్లి చిన్న, మేడి త్రిమూర్తులు, లోడ అప్పారావు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన టిఫిన్ బండి వద్ద దోశలు వేస్తూ ఓట్లు అభ్యర్థించారు.

సాత్వికకు కలెక్టర్ అభినందన


గిన్నిస్ రికార్డు పత్రాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందుకుంటున్న సాత్విక

ప్రకాశం నగర్: చెన్నైలోని స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ తమిళనాడు ఆధ్వర్యంలో యోగాలో ఏకకాలంలో 302 మంది చిన్‌స్టాండ్ భంగిమను ప్రదర్శించే కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా నగరానికి చెందిన వెలుగుబంటి సాత్విక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందడం అభినందనీయమని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఆమెను సాత్విక మర్యాదపూర్వకంగా కలిసింది. గిన్నిస్ రికార్డు ధ్రువపత్రాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందుకుంది.

అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యం

- ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్
- జోరుగా ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పని చేస్తున్నట్టు ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 4వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ బొంతా శ్రీహరి ఆధ్వర్యంలో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భరత్ రామ్ మాట్లాడుతూ నగరాన్ని అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దానన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత సేవలు అందిస్తానన్నారు. నగరంలో ఎంపీగా చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచురించిన పోస్టర్లను ప్రజలకు అందజేశారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నగరవాసులకు 24 గంటలూ తాగునీటి సరఫరా, గోదావరి ఘాట్లను కాశీలో మాదిరిగా అనుసంధానం చేయడం, గోదావరి బండ్‌ను హైదరాబాద్ ట్యాంక్ బండ్ కంటే అద్భుతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. డివిజన్‌లోని రోడ్లను సీసీ రహదారులుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 38వ డివిజన్‌లో పార్టీ శ్రేణులతో కలసి పర్యటించారు. కార్యక్రమాలలో పార్టీ సీనియర్ నేతలు, డివిజన్ పెద్దలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రెడాయ్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో ఎంపీ భరత్‌రామ్, గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: ప్రతిష్టాత్మక భవన నిర్మాణ సంస్థ క్రెడాయ్ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు అన్నారు. కవలగొయ్యిలోని క్రెడాయ్ భవనంలోని సమావేశ మందిరంలో గౌరవ చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రెడాయ్ సభ్యులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాబోయే ఎన్నికలలో తమ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. రుడా చైర్మన్ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఎన్నికల తర్వాత మాస్టర్ ప్లాన్ అమలుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజమండ్రి శాఖ చైర్మన్ సూరవరపు శ్రీనివాస్, అధ్యక్షుడు మన్యం ఫణి కుమార్, కార్యదర్శి చల్లా బాలమురళి, కోశాధికారి నరసింహరావు, ప్రతినిధులు నందెపు శ్రీనివాస్, పూడి శ్రీనివాస్, రెడ్డి రామకృష్ణ, రంగ ప్రసాద్, వెలుమూరి భీమశంకర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఎన్నికల మార్గదర్శకాలు తప్పకుండా పాటించాలి
- ఆర్‌ఓ, జేసీ తేజ్ భరత్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ నోటిఫికేషన్‌ను గురువారం ఉదయం విడుదల చేస్తామని, అనంతరం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామని జాయింట్ కలెక్టర్, రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.తేజ్ భరత్ తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గురువారం నుంచి ఈ నెల 25 వరకూ (ఈ నెల 21 ఆదివారం మినహా) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆర్‌ఓ కార్యాలయం వద్ద 100 మీటర్ల వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేసేందుకు 1 + 4 వరకూ మాత్రమే అనుమతిస్తామని, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు సహకరించాలని కోరారు. నామినేషన్ దాఖలు చేసే వ్యక్తితో పాటు ప్రతిపాదకుడు తప్పనిసరిగా రావాలని తెలిపారు. రూరల్ పరిధిలో 56 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లను గుర్తించామని, అక్కడ వెబ్ కాస్టింగ్, వీడియో రికార్డింగ్, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు ఐ.సాయిబాబా, వైవీకే అప్పారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కడియం: మండలం గ్రామ సచివాలయ ఉద్యోగులు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఎంపీడీవో రాజ్ మనోజ్ ప్రారంభించి, మజ్జిగను పంపిణీ చేశారు.

వైరాల అప్పారావు ప్రకటన హాస్యాస్పదం


విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారంతా ఉమ్మడి టీడీపీ అభ్యర్థిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మార్పీఎస్ నాయకుడు వైరాల అప్పారావు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ నాయకురాలు ఈతకోట బాపన సుధారాణి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నగరంలోని 13 మాదిగ సామాజిక వర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో మాదిగ సామాజికవర్గం తరఫున మాట్లాడటానికి ఆదిరెడ్డి వద్ద వైరాల అప్పారావు ఎంత ప్యాకేజీ తీసుకున్నారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో మాదిగల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, నగరంలో ప్రోత్సాహం అందిస్తున్న ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్‌కు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు ఓటేసి గెలిపించడానికి మాదిగలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ 30వ డివిజన్ ఇన్‌చార్జి కాటం ప్రియాంక మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చాక మాదిగలకు సముచిత స్థానం కల్పించారన్నారు. ఆముదాల పెదబాబు, కొమ్ము జిగ్లేర్, వెంట్రపాటి సురేష్, ముత్యాల వీర అప్పారావు, సురేష్ పాల్గొన్నారు.